
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 18 మే 2025



గ్రానైట్ క్వారీలపై పర్యవేక్షణ ఏదీ?

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నీలిరంగు గ్రానైట్ క్వారీల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. భద్రత కరువై కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. క్వారీల్లో ఏటా ఇద్దరు, ముగ్గురు ఏదో ఒక రూపంలో మృత్యువాత పడుతున్నారు. వాస్తవానికి మైన్స్ మేనేజర్ పర్యవేక్షణలో గ్రానైట్ క్వారీ నిర్వహణ పనులు చేయాలి. కాగా జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో మైన్స్ మేనేజర్ పోస్టులు ఎక్కడా భర్తీకాలేదు. ఫలితంగా క్వారీల నిర్వహణ అడ్డగోలుగా సాగుతోంది. గ్రానైట్ క్వారీల్లో పేలుళ్లకు చీఫ్‌కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ చెన్నై అనుమతులు ఉండాలి. కానీ జిల్లాలో ఆ పరిస్థితులు ఎక్కడా లేవు. గతంలో కోటేశ్వరరావు కలెక్టర్‌గా వ్యవహరించినప్పుడు గ్రానైట్ క్వారీల్లో పేలుళ్లకు సంబంధించి ఎన్‌వోసీలు జారీచేశారు. ఆ తరువాత ఎన్‌వోసీల జారీ ప్రక్రియ గాలికొదిలేశారు. జిల్లాలో టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి, సారవ కోట, పాతపట్నం తదితర ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. టెక్కలి ప్రాంతంలో గూడేం, సొంటినూరు, లింగాలవలస, అడ్డుకొండ, మొఖ లింగాపురం తదితర ప్రాంతాల్లో క్వారీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా క్వారీల్లో యథేచ్ఛగా పేలుళ్లు జరుగుతున్నా పోలీసులు సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. క్వారీల్లో ఏదైనా ప్రమాదం జరిగితే.. మృతుల కుటుంబ సభ్యులకు యాజమానులు కొంత పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొంటు న్నారు. భద్రతా ప్రమాణాలు మాత్రం పాటించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు హడావుడి చేయడం, ఆ తరువాత వాటి ఊసు మరిచిపోవడం పరిపాటిగా మారిందని ఆరోపిస్తున్నారు.

- 2023 జూన్ 16న బూర్జ మండలం కొరగాం పంచాయతీ పరిధిలోని ఓ క్వారీలో రాళ్లు పేర్చుతున్న క్రమంలో బాంబు పేలి.. ఒడిశాకు చెందిన దాసు అనే కార్మికుడు మృతి చెందాడు.
- 2023 జూలై 17న టెక్కలి మండలంలోని ఓ క్వారీలో ఎయిర్ కంప్రెషర్ పేలి బిహార్‌కు చెందిన భూషన్‌దాస్ అనే కార్మికుడు మృతిచెందాడు.
- 2023 ఆగస్టు 12న టెక్కలి మండలంలో ఓ గ్రానైట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్ గంగు రమణమూర్తి అనే కార్మికుడు మృతిచెందాడు. విధి నిర్వహణలో ఉండగా.. గ్రానైట్ బ్లాక్ పడడంతో కేబిన్‌లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు.
- గతేడాది మార్చి 9న టెక్కలి మండలంలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతిచెందాడు. క్వారీలో బ్లాక్ డ్రిల్ చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా చనిపోయాడు.
- గత ఏడాది జూన్ 29న పైడిభీమవరంలోని సరాక రసాయన పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని ఒక బ్లాక్‌లో ప్రమాదవశాత్తు పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఆ సమయంలో సమీపంలో కార్మికులు లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.
- గత ఏడాది జూలైలో పైడిభీమవరం పారిశ్రామికవాడలోని శ్రేయస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నిల్వల గోదాములపై రేకులు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు షమీర్‌షేక్, రహిబుల్‌షేక్ ప్రాణాలు కోల్పోయారు.
- తాజాగా ఈ నెల 16న మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపాన దబ్బగూడ రెవెన్యూ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీలో ముగ్గురు కార్మికులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.



టెక్కలిలోని గ్రానైట్ క్వారీ



ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

- కార్మికులకు భద్రత కరువు
- యంత్రాల మధ్య నలిగిపోతున్న శ్రమజీవులు

రణస్థలం, మే 17(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కార్మికులకు భద్రత కరువైంది. క్వారీలు, పరిశ్రమలు, భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకోగా.. ఒక్కోసారి కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొంతమంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. కార్మికుల ప్రాణాలు పోతున్నా.. యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పైడిభీమవరం పారిశ్రామికవాడతోపాటు పలాస ప్రాంతంలో జీడి పరిశ్రమలు ఉన్నాయి. టెక్కలి, పొందూరు వంటి ప్రాంతాల్లో క్వారీలు నడుస్తున్నాయి. పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేదు. కార్మిక చట్టాలను సైతం యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. యంత్రాల మధ్య పనిచేసే కార్మికులకు హీట్ రెసిస్టెంట్ ఆప్రాన్లు (మిగతా 6వ పేజీలో..)

● అందని ఈఎస్ఐ సేవలు..

జిల్లాలో పైడిభీమవరంలో దాదాపు 30 పరిశ్రమలున్నాయి. వీటిలో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతూనే ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో 22,800 మంది కార్మికులు గుర్తింపు పొందారు. కానీ వీరికి ఈఎస్ఐ సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు విశాఖ, లేదా విజయనగరం తరలించాల్సి వస్తోంది. అత్యవసర వైద్యం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే తక్షణం 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రితో పాటు అత్యాధునిక వైద్యసదుపా యాలు అందుబాటులోకి తేవాలని కార్మికులు కోరుతున్నారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● అమ్మో క్వారీలు..

జిల్లాలో వంద వరకూ క్వారీలు నడుస్తున్నాయి. అందులో అనుమతి ఉన్నవి కొన్నే. ప్రధాన రాజకీయ కుటుంబాలకు చెందిన వారి చేతిలో క్వారీలు ఉన్నాయి. అక్కడ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నా.. బయటకు రాకుండా మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. టెక్కలి, నందిగాం, పొందూరు, కంచిలి, పలాస మండలాల్లో క్వారీల నిర్వహణ అధికం. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. కానీ వెలుగుచూసిన ఘటనలు కొన్నే. రాజకీయ జోక్యంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మెళియాపుట్టి, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీ వద్ద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను ఆదుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మెళియాపుట్టి మండలం దీనబంధుపురం సమీపంలోని వీఆర్‌టీ గ్రానైట్ క్వారీలో శుక్రవారం రాత్రి ఆర్ముగం, రామారావు, అప్పన అనే కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. పిడుగుపాటుతో ఆ ముగ్గురూ మృతి చెందారని యాజమాన్యం చెబుతుండగా, క్వారీలో బాంబు పేలుళ్ల వల్లే ప్రాణాలు కోల్పోయారని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై క్వారీ యాజమాన్యంతో శుక్రవారం రాత్రి వాగ్వాదానికి దిగారు. శనివారం ఉదయం కూడా మృతదేహాలతో గ్రానైట్ పరిశ్రమ వద్ద ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ గ్రానైట్ క్వారీని పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. 'శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో క్వారీలో కార్మికులు మృతి చెందిన విషయం తెలిసింది. దీనిపై వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. అటవీ, మైనింగ్, రెవెన్యూశాఖ అధికారులతో పాటు పోలీసులు, క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరిస్తున్నాం. గ్రానైట్ పేలుళ్ల సమయంలో పిడుగు పడి ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. బాధితుల పోస్టుమార్టం రిపోర్టు ఆలస్యమైతే సరైన రిపోర్టు రాదు. నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామ'ని హామీ ఇచ్చారు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు శాంతించి.. శనివారం సాయంత్రం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



క్వారీని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్వారీల నిలుపుదల..

జిల్లాలోని గ్రానైట్ పరిశ్రమల్లో అన్నీ అనుమతులు చూపించే వరకూ పనులు నిలుపుదల చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. క్వారీల్లో అనుమతులు ఉంటేనే పనులకు అంగీకరిస్తామని తెలిపారు. క్వారీల్లో పేలుళ్లు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సరాక పరిశ్రమలో అగ్నిప్రమాదం (ఫైల్)



క్వారీ వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

అన్ని కోణాల్లో దర్యాప్తు: ఎస్పీ మహేశ్వరరెడ్డి

మెళియాపుట్టి, మే 17 (ఆంధ్రజ్యోతి): దీనబంధుపురం సమీపంలో గ్రానైట్ క్వారీని ఎస్పీ మహేశ్వరరెడ్డి శనివారం సాయంత్రం పరిశీలించారు. పేలుడు పదార్థాలు వినియోగించారేమోనని తనిఖీ చేశారు. ముగ్గురి మృతికి గల కారణాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని తెలిపారు. క్లూస్‌టీమ్‌తో వివరాలు సేకరించి.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, సీఐ రామారావు, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, తదితరులు

సైనికులకు సెల్యూట్

- 'ఆపరేషన్ సిందూర్' పోరాట స్ఫూర్తితో తిరంగా ర్యాలీ
- భారతీయుల విజయమంటూ.. మంత్రి అచ్చెన్న హర్షం

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి ప్రతీకగా.. భారత సైనికులు 'ఆపరేషన్ సిందూర్' పేరిట బుద్ధి చెప్పడంపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు.. సైన్యానికి మద్దతు తెలియజేస్తూ.. తిరంగా ర్యాలీ నిర్వహించారు. శనివారం కోటబొమ్మాళిలో మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులతోపాటు పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. కొత్తమ్మతల్లి ఆలయం నుంచి రైతుబజారు వరకు త్రివర్ణ పతకాలతో ర్యాలీ నిర్వహిస్తూ.. అమర జవానులకు నివాళులర్పించారు. త్రివిధ దళాల ధైర్యసాహసాలను కొనియాడారు. 'సైనికులకు సెల్యూట్.. జై జవాన్', 'భారత మాతాకీ జై, వందే భారత్' అంటూ.. నినాదాలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం దీటైన సమాధానం ఇచ్చింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా భారత్ విడిచిపెట్టదు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భద్రతా దళాలు దేశానికి గర్వకారణంగా నిలిచాయి. ప్రాణాలకు తెగించి పోరాడిన సైనికులకు ప్రతి ఒక్కరూ సెల్యూట్ చెప్పాల'ని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, బీజేపీ నాయకులు అట్టాడ రవిబాబ్జీ, బి.ఉమామహేశ్వరరావు, బోయిన గోవిందరాజులు, ఎల్ఎల్ నాయుడు, బోయిన రమేష్‌కుమార్, పీనకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు, వెలమల విజయలక్ష్మి, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన విధానం పాటించాలి

- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు, ప్రతి ఒక్కరికీ శారీరక వ్యాయామం.. మొత్తంగా ఆరోగ్య జీవన విధానమే నేటి ఆవశ్యకత అని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినం (హైపర్ టెన్షన్ డే) సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో ఆమె ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ '18 ఏళ్లు నిండిన వారిలో 25శాతం మంది రక్తపోటుకు గురవుతున్నారు. వ్యాయాయం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రతీ ఒక్కరూ వారంలో 5 రోజులు కనీసం అరగంటపాటు వ్యాయామం చేయాలి. ఉప్పు, స్వీట్లు, నూనెల వాడకం తగ్గించాలి. వైద్యుల సూచనలు తప్పక పాటించాలి' అని తెలిపారు. వ్యాయామం చేసి బీపీ నియంత్రణలో ఉంచుకునేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటరావు, డీపీఎంవో డాక్టర్ రవీంద్ర, ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ సుజాత, కార్యాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

గ్రానైట్ రాయి.. ప్రాణం తీసింది

- సింగుపురం హైవేపై రెప్పపాటులో రెండు ప్రమాదాలు
- లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు.. 15 మందికి గాయాలు
- అదే ప్రాంతంలో గ్రానైట్ లారీ సడెన్‌బ్రేక్
- లారీ ముందు భాగంపై బండ పడి డ్రైవర్ మృతి

శ్రీకాకుళం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం సింగుపురంలోని కేజీబీవీ సమీపంలో హైవేపై శనివారం వేకువజామున రెప్పపాటులో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో గ్రానైట్ రాయి పడి అనకాపల్లి జిల్లాకు(విశాఖపట్నం) చెందిన ఒకరు మృతి చెందగా, లారీని ఢీకొని ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన ప్రైవేటు ట్రావెల్ బస్సు జైపూర్ నుంచి శ్రీకాకుళం మీదుగా బరంపురానికి వెళ్తోంది. ఈ క్రమంలో సింగుపురం హైవే వద్ద.. ముందున్న లారీని ఓవర్‌టేక్ చేసేందుకు బస్సుడ్రైవర్ యత్నించాడు. అదే సమయంలో ముందున్న లారీడ్రైవర్... తన వాహనాన్ని కాస్త స్లో చేశాడు. వెనుక ఉన్న బస్సు... (మిగతా 6వ పేజీలో..)



డ్రైవర్‌తో సహా నుజ్జునుజ్జయిన గ్రానైట్ లారీ ముందు భాగం



లారీని ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఒడిశా ప్రైవేటు బస్సు

ఎక్కడ ఉండాలి స్వామీ?
- శ్రీకూర్మంలో భక్తులకు వసతులు కరువు
- శ్రీకాకుళంలో బస చేయాల్సిందే
- శిథిలావస్థలో టీటీడీ సత్రం

6లో

సమాచారం

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

నరసన్నపేట, మే 17(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఐఐటీలో ఇంజనీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం జరగనుంది. జిల్లాలోని నరసన్నపేటలో కోర్ టెక్నాలజీ, చిలకపాలెంలో శివానీ ఇంజనీరింగ్ కళాశాలను పరీక్షా కేంద్రాలుగా ఎన్‌టీఏ (జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ) కేటాయించింది. ఈ కేంద్రాల్లో సుమారు 740 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కంప్యూటర్ ఆధారితంగా ఈ పరీక్ష జరుగుతుంది. పేపర్ -1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటలు వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులను ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 1 గంట నుంచి 2 గంటలు వరకు మాత్రమే అనుమతిస్తారు. అడ్మిట్ కార్డు మీద తల్లిదండ్రులు లేదా సంరక్షకుడు సంతకం ఉండాలి. అభ్యర్థులు గుర్తింపుకార్డు తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.

అమ్మో.. పిడుగులు!
- ఈ సీజన్‌లోనే అధికం
- చెట్ల కిందకు వెళ్లకూడదు
- అప్రమత్తతతోనే ప్రమాదాలకు దూరం

6లో

భూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయండి
- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

7లో



అమ్మో.. పిడుగులు!

● ఈ సీజన్‌లోనే అధికం ● చెట్ల కిందకు వెళ్లకూడదు ● అప్రమత్తతతోనే ప్రమాదాలకు దూరం

ఎచ్చెర్ల, మే 17(ఆంధ్రజ్యోతి):

ప్రస్తుత వేసవి కాలంలో పగలంతా మండే ఎండలతో బాధపడితే.. సాయంత్రమైతే వాతావరణం చల్లబడుతోంది. ఒక్కసారిగా చీకట్లు కమ్ముకోవడం.. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడం, విద్యుత్ సరఫరాను నిలిపేయడం సర్వసాధారణంగా మారింది. ఈ కాలంలోనే ఏదో ఒక మూల పిడుగు పడిందని..ఎక్కడో ఓ చోట ఎవరో ఒకరు ప్రాణాలు కోల్పోయారనే వార్తలు వింటున్నాం. ఓ వైపు వాతావరణ హెచ్చరికల కేంద్రం ముందుగా సమాచారం అందిస్తున్నా... జరగాల్సిన నష్టం జరుగుతూనే ఉంది.

ఆరుబయట ఉన్నవారికే ప్రమాదం ఎక్కువ..

సాధారణంగా సాయంత్ర సమయాల్లోనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. ఆ సమయంలో రైతులు, గొర్రెల కాపరులు పొలాల్లోనే ఉంటుంటారు. వీరే ఎక్కువగా పిడుగుపాటుకు గురవుతుంటారు. ఫలితంగా ఆ కుటుంబాలు రోడ్డున పడుతుంటాయి. వర్షం పడితే చాలా మంది చెట్ల కిందకు వెళ్తుంటారు. ఎత్తయిన చెట్లు పిడుగులను ఆకర్షిస్తుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నా... అదేమీ పట్టనట్టు వ్యవహరించడం వల్లనే అధికశాతం ప్రమాదాలకు గురవుతున్నారు.

వాతావరణంలో మార్పులతో..

శాస్త్రీయంగా ఆలోచిస్తే ధ్వని కంటే కాంతి వేగమే అధికం. వర్షాలు కురిసే టప్పుడు మెరుపు (పిడుగులు) తర్వాతే ధ్వని వినిపిస్తుంది. వాతావరణంలో గాలి, నీటి ఆవిరితో కూడిన మేఘాలు చల్లబడితే వర్షం కురుస్తుంది. చల్లగాలి వీచే దిశగా మేఘాలు ప్రయాణిస్తాయి. మేఘాల రాపిడితో వేడి ఉద్భవించి వెలుతురు జనిస్తుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగ కేంద్రం ఆధారంగా మెరుపులను గుర్తించి హెచ్చరించే వ్యవస్థను కూడా ఏర్పాటు చేశారు. ఈ పరిశోధనా కేంద్రం ద్వారా మెరుపులు, ఉరుములు వచ్చే ప్రాంతాన్ని ముందుగా గుర్తించి సమాచారాన్ని చేరవేస్తున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల బాహ్య ప్రదేశాల్లోనే ఇబ్బంది కలుగుతుంది. సాధారణంగా వర్షం ప్రారంభానికి ముందే పిడుగులు పడుతుంటాయి. బహిరంగ ప్రదేశాల్లో పిడుగులు అధికంగా పడుతుంటాయి. ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఉన్న వారు పిడుగుపాటుకు గురై చనిపోతుంటారు. కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పిడుగు పడిన శబ్దం 24 కిలోమీటర్ల పరిధిలో అందరికీ వినిపిస్తుంది. ఆ సమయంలో 14 కిలోమీటర్ల పరిధిలో వర్షం కురిసే అవకాశం ఉంది. పిడుగుకి ఓ ఆకారం లేదు. ఎత్తయిన ప్రదేశాలలో, పెద్ద చెట్లపైన, తడిగా ఉన్న ప్రాంతాలలో ఇవి పడతాయి.

ఘటనలెన్నో..

● ఈ నెల 12న సరుబుజ్జిలి మండలం పాలవలసకి చెందిన గొర్రెల కాపరి దాసరి అప్పన్న(47) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. అప్పన్న చిగురువలస పంచాయతీ పరిధిలోని తాడికొండ వద్ద గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో మెరుపులతో పిడుగు పడడంతో అప్పన్న అక్కడికక్కడే మృతి చెందాడు.

● అదే రోజు సంతబొమ్మాళి మండలం మర్రిపాడులో పిడుగుపాటు గురై బడ్డ మల్లేషుకు చెందిన ఆవు మృతి చెందింది.

● కొత్తూరు మండలం అడ్డంగి గిరిజన గ్రామంలో ఈ నెల 12న పొద్దుపోయే సమయంలో పిడుగు పడి సవర చిన్నారమ్మ(30) మృతి చెందింది. మేకలు కాస్తున్న సమయంలో ఈ సంఘటన జరగ్గా.. మరుసటి రోజు వెలుగులోకి వచ్చింది.

● ఈ నెల 14న కొత్తూరు మండలం కొత్తకొత్తూరు వద్ద బుధవారం సాయంత్రం పొలంలో ఉన్న గేదెల మందపై పిడుగుపడింది. దీంతో లోతుగెడ్డ చలపతిరావుకు చెందిన గేదె మృతి చెందింది.

● అదేరోజు ఎల్.ఎన్.పేట, మండలంలోని చింతలబడవంజలోని ఎస్.నారాయణరావు పశువులశాలపై పిడుగుపడి శాల ధ్వంసమైంది.

ఫోన్లు వినియోగించొద్దు



వాతావరణలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో మొబైల్స్ వాడడం సరికాదు. రేడియేషన్ కారణంగా పిడుగులను ఆకర్షించే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులను గుర్తించేందుకు ఇస్రో ప్రయోగశాల నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. వాతావరణంలో మార్పులు గమనించి సరైన జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. వర్షం కురవడానికి ముందు భీకర శబ్దాలు వచ్చేటప్పుడు.. వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండకూడదు. అందుబాటులో ఉన్న సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవడం మంచిది.

-డాక్టర్ జి.సూర్యనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్, విజయనగరం



ఐస్‌క్రీమ్ భలే ఉందే!

'ఐస్‌క్రీమ్‌లు ఎలా తినాలో మాకూ తెలుసు' అన్నట్టుగా... ఓ వానరం శనివారం చేసిన విన్యాసం చూపరులను ఆకట్టుకుంది. బాతుపురం గ్రామంలో తిరుగుతున్న ఓ వానరం ఎండవేడిమికి అలసిపోయిందేమో..నీటి కోసం అటూ ఇటూ వెదికింది. ఎక్కడా కానరాకపోవడంతో నిరాశతో ఓ ఇంటి దగ్గర నీడపట్టున సేదదీరడానికి ఉపక్రమించింది. అదే సమయంలో ఐస్‌క్రీం బండి ఒకటి అక్కడికి వచ్చింది. వానరం దుస్థితిని గుర్తించిన స్థానికులు దానికి ఐస్‌క్రీమ్‌ను అందించారు. మనుషుల్లాగానే అది కూడా ఒడుపుగా ఐస్‌క్రీమ్‌ను పుల్ల వైపు పట్టుకొని తినడాన్ని చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. ఈ దృశ్యాన్ని కొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

-వజ్రపుకొత్తూరు, మే 17 (ఆంధ్రజ్యోతి)

ఎక్కడ ఉండాలి స్వామీ?

● శ్రీకూర్మంలో భక్తులకు వసతులు కరువు
● శ్రీకాకుళంలో బస చేయాల్సిందే
● శిథిలావస్థలో టీటీడీ సత్రం
● నిరుపయోగంగా పర్యాటక శాఖ కాటేజీ



గార, మే 17(ఆంధ్రజ్యోతి):

ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథుని క్షేత్రంలో భక్తులకు సరైన వసతులు అందుబాటులో లేవు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్షేత్రానికి దేశవ్యాప్తంగా నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. కానీ ఒకరోజు ఉండడానికి కూడా వసతి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. దీంతో రాత్రి బస చేయడానికి జిల్లా కేంద్రమైన శ్రీకాకుళానికి వెళ్లాల్సి వస్తోంది. ఏటా రూ. లక్షల్లో ఆదాయం వస్తున్నా ఇక్కడ భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై ఆలయ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఇక్కడికి సుదూర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వాహనాల్లో కుటుంబాలతో వస్తుంటారు. వారు కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడానికి కూడా వసతి సౌకర్యం వృద్ధులు, పిల్లతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దేవాలయానికి ఆదాయం కోసం చూస్తున్నారు తప్ప భక్తులకు వసతులు కల్పించడంలో ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న టీటీడీ సత్రం

శిథిల స్థితిలో...

శ్రీకూర్మంలో 1972లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన సత్రం శిథిలావస్థకు చేరుకుంది. 12 గదులుతో ఉండే ఈ సత్రం నిర్వహణను ఆలయ అధికారులు గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి ఎదురైంది. పదేళ్ల కిందటి వరకు భక్తులు బస చేయడానికి వీలుగా ఉండేది. అటు తర్వాత ఆలయ అధికారులు నిర్వహణ విషయం పట్టించుకోకపోవడంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి, గదుల గోడలు బీటలు వారిపోయి ఉన్నాయి. ఫలితంగా ఈ భవనం నిరుపయోగంగా ఉంది.



అన్నదాన సత్రంగా ఉన్న కాటేజీ

కాటేజీలో అన్నదానం..

ఈ క్షేత్రం వెనుక పదేళ్ల కిందట పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షతో విశాలమైన కాటేజ్‌ను నిర్మించారు. ఈ భవనం నిర్వహణ బాధ్యతను దేవాలయ అధికారులకు అప్పగించారు. వీరు భక్తులకు అద్దెకు ఇవ్వకుండా అలాగే వదిలేశారు. అందుబాటులో పెద్ద కాటేజీ ఉన్నప్పటికీ భక్తులకు వసతి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా ఉన్న ఈ కాటేజీలో నిత్యాన్నదాన పథకం నిర్వహిస్తున్నారు. కొంతభాగాన్ని వంటలు, భోజనాల కోసం వినియోగిస్తున్నారు. మిగిలిన నాలుగు గదులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పూర్వపు టీటీడీ సత్రం స్థానంలో కొత్త కాటేజీని నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని... అంతవరకు ప్రస్తుతం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న కాటేజీలో మిగిలిన గదులనుఏ అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

వసతి సౌకర్యం లేదు..

శ్రీకూర్మనాథుని క్షేత్రంలో భక్తులకు వసతులు కల్పించడంపై ఆలయ అధికారులు దృష్టి పెట్టడం లేదు. దీని వల్ల దూర ప్రాంతాల భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

-కె.వెంకటేశ్వరరావు, భక్తుడు, విశాఖపట్నం

వసతి కల్పిస్తాం



ఇక్కడ శిథిలావస్థలో ఉన్న టీటీడీ సత్రం స్థానంలో కొత్త కాటేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. పర్యాటక శాఖ కాటేజీలో భక్తులకు వసతి కల్పించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తాం.

-కె.నరసింహనాయుడు, ఈవో



శ్రీనివాసునికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా పుష్పయాగం

నరసన్నపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో రుత్వికులు చామర్తి శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, మావుడూరి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా స్వామి వారిని అలంకరించి... పుష్పయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రానైట్ రాయి.. ప్రాణం తీసింది

(ఐదో పేజీ తరువాయి)

ఆ లారీని ఢీకొంది. ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదు. కానీ బస్సు ముందుభాగం.. లారీ వెనుక భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇదంతా వేకువజామున నాలుగు గంటల సమయంలో జరిగింది. సమాచారం అందడంతో హైవే సిబ్బంది, పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలతో ఉన్న మరికొంతమంది.. మరో వాహనంలో బరంపూర్ వెళ్లిపోయారు.

● అయితే క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలింపు.. ఇటు హైవేపై వాహనాల మళ్లింపు జరుగుతుండగానే మరో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. అదే రోడ్డుపై నాలుగు లారీలు వస్తున్నాయి. అందులో రెండు లారీలు గ్రానైట్ బండలను టెక్కలికి తరలిస్తుండగా.. మరో రెండు లారీలు ఇతర సరుకులతో హైవేపై నుంచి వెళ్తున్నాయి. ముందుగా బస్సు ప్రమాదం జరిగిన చోటుకు రాగానే... గ్రానైట్ బండలతో వెళ్తున్న లారీడ్రైవర్ బ్రేక్ వేశాడు. భారీ సైజు బండలు కావడంతో.. లారీలో ఉన్న ఓ బండ ఏకంగా ముందుభాగంపై పడింది. దీంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ రాపర్తి నూకరాజు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ ముందు భాగం నుజ్జుకావడంతో.. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడకు వచ్చి ప్రత్యేక యంత్రాలతో భాగాలను తొలగించి మృత దేహాన్ని బయటకు తీశారు. అయితే లారీ ఢీకొన్ని ఘటనలో... అదే రోడ్డుపై దానికి ముందున్న లారీలు ఒకదానితో మరొకటి ఢీకొన్నాయి. పరిమితికి మించిన గ్రానైట్ బండలను లారీలపై తరలించడం.. సడెన్ బ్రేక్ వల్ల బండ ముందుకు కదిలిపోవడం ప్రమాదానికి కారణమైంది. బండలను తరలిస్తున్నప్పుడు వాటిని కట్టకుండా లారీలతో తరలించేయడం దారుణం. నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి తరహా ప్రమాదాల సంభవిస్తూనే ఉన్నాయి. సంఘటన స్థలాన్ని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడపునాయుడు, ఎస్‌ఐలు హరికృష్ణ, రాము పరిశీలించారు. మృత దేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడు.. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించి అక్కడకు సమాచారం చేరవేశారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

(ఐదో పేజీ తరువాయి)

గమ్‌బూట్లు, హెల్మెట్లు గ్లౌజులు విధిగా అందించాలి. వీటిని అందించడంలో పరిశ్రమల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు మృత్యువాత పడుతున్నారు. బాధితులకు నామమాత్రంగా పరిహారం అందించి యాజమాన్యాలు చేతులు దులుపుకొంటున్నాయి.

● కానరాని తనిఖీలు..

వాస్తవానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి పరిశ్రమలను తనిఖీ చేయాలి. ఇన్‌స్పెక్టరీ ఆఫ్ ఫ్యాక్టరీస్, భూగర్భ గనుల శాఖ, కార్మిక శాఖ అధికారులు తనిఖీ చేయాలి. కానీ ఈ అధికారులు ఎక్క డుంటారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. జిల్లాల విభజన జరిగినా.. ఈ కార్యాలయాలు మాత్రం ఉమ్మడిగానే కొనసాగుతున్నాయి. సిబ్బంది కొరత సాకుతో తనిఖీలు సక్రమంగా సాగడం లేదు. పరిశ్రమల నిర్వహణలో యాజమాన్యాల నిర్లక్ష్యం, భద్రతాచర్యలు పాటించకపోవడం, కార్మిక చట్టాలను అమలు చేయకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా కార్మికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరముంది.

పట్టించుకోని కార్మిక శాఖ..

జిల్లాలో కార్మిక శాఖ ప్రేక్షక పాత్రకే పరిమితమవుతోంది. పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. కార్మిక చట్టాలను అమలుచేయకపోయినా చర్యలు తీసుకోవడం లేదు. కనీసం పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయో తనిఖీ చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం దారుణం. ఇప్పటికైనా దృష్టి పెట్టాలి.

-పి.తేజేశ్వరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు

భద్రత గాలికి..

కార్మికుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. పరిశ్రమల వద్ద కనీస భద్రతా చర్యలు చేపట్టడం లేదు. క్వారీలు సైతం ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు కోల్పోయే సమయంలో రేటు కట్టి చేతులు దులుపుకొంటున్నారు. కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. చనిపోతున్నా పరిహారం దక్కడం లేదు.

-సీహెచ్ అమ్మన్నాయుడు, కార్మికుల నాయకుడు, పైడిభీమవరం



ఎచ్చెర్ల పోలీసు క్వార్టర్స్ ఆవరణలోని మరిడమ్మ ఆలయం

నేడు మరిడమ్మ సంబరం

ఎచ్చెర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు కుటుంబాలు అత్యంత ప్రీతిపాత్రంగా పూజించే మరిడమ్మ తల్లి సంబరం ఆదివారం నిర్వహించనున్నారు. ఏటా వైశాఖ మాసంలో మరిడమ్మ తల్లి సంబరాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు డప్పు వాయిద్యాలతో, సన్నాయి మేళతాళాలతో, అమ్మవారి మండపానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఐదు దశాబ్దాలుగా మరిడమ్మ తల్లిని సాయుధ పోలీసు కుటుంబాలతో పాటు లింగాలపేట, జరజాం, బట్నవానిపేట, తంగివానిపేట, ఎస్ఎం పురం, ఎచ్చెర్ల గ్రామాల భక్తులు కొలుస్తున్నారు. కోర్కెలు తీర్చే కల్పవల్లి మరిడమ్మను పూజిస్తే అంతా మంచి జరుగుతుందని పోలీసు కుటుంబాల విశ్వాసం. ఎక్కడెక్కడో స్థిరపడిన సాయుధ పోలీసు కుటుంబాలకు చెందిన వారు ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం చేస్తారు.

వేంకటేశ్వరునికి కిరణాభిషేకం

ఎచ్చెర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల కొండపై గల శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో స్వామి వారి పాదాలను సూర్యకిరణాలు స్పృశించాయి. సుమారు 3 నిమిషాల పాటు సూర్య కిరణాలు స్వామి వారి పాదాలను స్పర్శించడంతో భక్తులు ఆనందంతో ఈ దృశ్యాన్ని తిలకించారు. ఏటా వైశాఖమాసంలో స్వామి వారి పాదాలను సూర్యకిరణాలు తాకుతాయని ఆలయ ధర్మకర్త గుంప శివప్రసాద్, అర్చకులు దూబ శరత్‌కుమార్ (భవానీ) తెలిపారు.



దూదివారి కోవెలలో తులసిమాలలతో అలంకరణ

శ్రీనివాసునికి పూజలు..

శ్రీకాకుళం కల్చరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించారరు. చిన్న బజార్‌లో ఉన్న దూదివారి ఆలయంలో అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి తులసి మాలలు, పూలతో అలంకరించారు. నారాయణ తిరుమలలో వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు.



ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

సమష్టి కృషితో పారిశుధ్యం మెరుగు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- శ్రీకూర్మంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గార, మే 17(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో పారిశుధ్యం మెరుగుపర్చుకోవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం శ్రీకూర్మంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు అధికారులు కూడా సహకరించాలన్నారు. గ్రామంలో పలువురు ఇళ్లకు వెళ్లి పారిశుధ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి పథకం కింద పనులు చేస్తున్న వేతనదారులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు వద్ద తాగునీరు, నీడ కోసం టెంట్లు, మందుల కిట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, సర్పంచ్ గోరు అనిత, ఏపీవో సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఆదిత్యాలయ పరిసరాల్లో..

అరసవల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ పరిసరాల్లో శనివారం ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, జిల్లా పర్యాటకా ధికారి ఎన్.నారాయణరావు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, తదితరులు ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసి, చెత్తను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతకు కట్టు బడి ఉంటామని, స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో నీలయ్య, గన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

అరసవల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక 2వ డివిజన్ బుచ్చిపేట వద్ద డివిజన్ ఇన్‌చార్జి అక్కేన రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి శివ, మజ్జి జగన్, తారక్, రమణ, యశోద, ధర్మారావు, సచివాలయ సిబ్బంది, పద్మ, సంతోషి పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

అరసవల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. బస్‌స్టేషన్ పరిసరాలు, కాలువలను శుభ్రం చేసి, చెత్తను తొలగించి, ప్రయాణికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సుమారు 40 మది సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో వారితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. "బీట్ ది హీట్"లో భాగంగా ప్రయాణికుల కోసం రెండు కూలర్ ఫ్యాన్లు, నాన్‌స్టాప్ ప్లాట్ ఫారాల వద్ద 20 కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 2డిపో మేనేజర్ రవిశంకర్ శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయండి

- జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పొందూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, చెరువు, గెడ్డపోరంబోకు స్థలాలు ఆక్రమించినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తహసీల్దార్ ఆర్.వెంకటేష్ ను ఆదేశించారు. తండ్యాం పంచాయతీ బొట్లపేట గ్రామ పరిధిలో వీరమరణం పొందిన జవాన్ సింగూరు విష్ణుమూర్తి కుటుంబానికి కేటాయిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ఆపరేషన్ బ్లూస్టార్‌లో భాగంగా తోలాపి గ్రామానికి చెందిన సింగూరు విష్ణుమూర్తి భార్య శాంతకు తోలాపిలో 2.5 ఎకరాల స్థలం కేటాయించారు. అయితే చెరువు గర్భంలో భూమి కేటాయించడంతో 2022లో దీనిని రద్దు చేశారు. తనకు భూమి కేటాయించాలని సింగూరు శాంత ఉన్నతాధికారులకు వినతి అందించడంతో సెక్రటేరియట్ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో బొట్లపేట పరిధిలో స్థలపరిశీలన చేశారు. తక్షణమే పట్టా, పాస్‌బుక్‌లు సిద్ధం చేయాలని తహసీల్దార్‌కు సూచించారు.



అధికారులకు సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పరిసరాల పరిశుభ్రతే మనందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యానికి అంత మంచిదన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పారిశుధ్య కార్మికులకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా, టీడీపీ నాయకులు అన్నెపు భాస్కరరావు, సనపల చెల్లం నాయుడు, కూన ఆంజనేయులు, నాగళ్ల మురళీధర్, పీవీవీ ప్రసాద్, దవళ అప్పలనాయుడు, కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, ఆర్ఐ తమ్మినేని గోవిందరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వేసవిని జయిద్దాం



మాట్లాడుతున్న ఆయుష్ వైద్యులు జగదీష్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ బంగ్లా వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పరిసరాల్లో ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 'బీట్ ది హీట్ (వేసవిని జయిద్దాం)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత, వడగాలుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బాలింతలు, పిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో ఆయుష్ శాఖ సిబ్బంది కె.చంద్రశేఖరరావు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, యోగీశ్వరరావు, కరణం ఉమామహేశ్వరరావు, శ్రీనివాస పట్నాయక్, చల్లా.దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్యుల జయంతి



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, మే 17(ఆంధ్రజ్యోతి): బలగలో ఉన్న హరేరామ మందిరంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమాచార్యుల అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం 30 మంది గాయకులచే అన్నమాచార్య సంకీర్తన నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, రాజరాజేశ్వరీ దేవిపీఠం అధ్యక్షుడు సుసరాపు లక్ష్మీ గణపతి శర్మ ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ వ్యవస్థాపకులు పెంకి నాగేశ్వరరావు, శృతిలయ సంగీత కళాశాల వ్యవస్థాపకులు రెడ్డి సత్యనారాయణ, బెహరా నాగేశ్వరరావు, పాల్గొన్నారు. అనంతరం అన్నమయ్య కీర్తనలకు నృత్య ప్రదర్శన నిర్వహించారు.

క్వారీల నిలుపుదలకు ఆదేశాలు

- అనుమతులకు మించి నిర్వహిస్తున్నట్టు గుర్తింపు

పొందూరు, మే 17(ఆంధ్రజ్యోతి): రాపాక, కృష్ణాపురం, పుల్లాజీపేట తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలోని క్వారీలపై తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎస్ఐ వి.సత్యనారాయణ శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రాథమిక విచారణలో భాగంగా నిర్వహించిన దాడుల్లో ఎక్కువ క్వారీలు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. అప్పలరాజు అనే వ్యక్తికి కేవలం ఒక హెక్టారు(2.5 ఎకరాలు) మాత్రమే లీజు అనుమతులు ఉండగా భారీస్థాయిలో క్వారీ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. తనకు తెలియకుండా తన పక్కన కొంతమంది క్వారీ నిర్వహిస్తున్నట్టు అధికారులకు అప్పలరాజు చెప్పడంతో తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కన తెలియకుండా క్వారీ ఎవరో ఎలా నిర్వహిస్తారని క్వారీ అనుమతులు రద్దుచేయడమే కాకుండా 10 రెట్లు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మరికొంతమంది డీపట్టా భూముల్లో క్వారీలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. వీరికి నోటీసులు జారీ చేస్తామన్నారు. మూడు రోజులపాటు క్వారీల నిర్వహణ నిలుపుదల చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మైనింగ్ అధికారులతో కలిసి సంయుక్త విచారణ జరుపుతామని తర్వాతే నిర్వహణకు అనుమతులు ఇస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

కఠిన చర్యలు తప్పవు



గారపేట వద్ద గల క్వారీని పరిశీలిస్తున్న డీఎస్పీ

పొందూరు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మైనింగ్ లీజు, అనుమతులులేని క్వారీలు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదుచేసి కఠినమైన చర్యలు తప్పవని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద హెచ్చరించారు. మండలంలో పలు గ్రామాల పరిధిలో జరుగుతున్న క్వారీలను పరిశీలించారు. క్వారీలలో నిపుణులు, అనుమతిపొందిన బ్లాస్టర్ ఉండాలని అలాకాకుండా సాధారణ కూలీలతో బ్లాస్టింగ్ చేస్తే క్వారీ అనుమతులు రద్దు చేయడంతోపాటు నిర్వాహకులపై ఎక్స్‌ప్లోజివ్ చట్టం ప్రకారం కేసు నమోదు చర్యలు తీసుకుంటామన్నారు. లీజులు, అనుమతిపొందిన క్వారీలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీల వివరాలతో నివేదిక ఎస్ఐ వి.సత్యనారాయణను ఆదేశించారు.

క్రీడా మైదానంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

ఇచ్ఛాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సురంగిరాజా మైదానంలోని వైఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద క్రీడాకారులకు బీట్ ద హీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండలు బాగా పెరిగినందున అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎండ తీవ్రతకు తట్టుకొనేందుకు తరచూ మజ్జిగ, మంచినీరు. ఓఆర్ఎస్ తీసుకోవాలని తెలిపారు. కమిషనర్ ఎన్.రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సరుబుజ్జిలి, మే 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల పిడుగుపాటు ప్రమాదానికి గురై మృతి చెందిన పాలవలస గ్రామానికి చెందిన దాసరి అప్పన్న కుటుంబాన్ని వైసీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీనిచ్చారు.

డోర్ డెలివరీకి టెండర్ల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు పౌర సరఫరాల సంస్థ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జి.సిగడాం, మెళియాపుట్టి, సరుబుజ్జిలి మండలాల పరిధిలో గల చౌక దుకాణాలకు, గ్రామ/వార్డు సచివాలయాలకు సరుకులను నేరుగా లబ్ధిదారుల గడప వద్దకే చేర్చేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. టెండర్లు పొందిన వారి కాంటాక్టు 2027 మార్చి 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందన్నారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు జిల్లా పౌరసరఫరాల మేనేజరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, శ్రీకాకుళం వారి పేరున రూ.5000 డీడీ చెల్లించి, టెండర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను, టెండర్ ఫామ్‌లను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. టెండర్లను ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీలోగా దాఖలు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 7732098637 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

పాలపోలమ్మ సన్నిధిలో న్యాయాధికారి



అమ్మవారిని దర్శించుకుంటున్న న్యాయాధికారి రమ్య

ఆమదాలవలస, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇలవేల్పు పాల పోలమ్మ అమ్మవారిని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.రమ్య శనివారం దర్శించుకున్నారు. ఇటీవల స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు విధుల్లో చేరిన సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మొదలవలస రమేష్, ఆలయ అర్చకులు ఆమెకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి గోత్ర నామాలతో పూజలు చేశారు.

గిట్టుబాటు ధర లేక రైతులకు అన్యాయం



మాట్లాడుతున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ ప్రభాకరరావు

అరసవల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర అన్యాయం జరుగుతోందని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు విమర్శించారు. రాష్ట్ర పర్యటనకు శ్రీకాకుళం వచ్చిన ఆయన స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత కూడా రైతులకు ఇటు ధాన్యం, మిర్చి గానీ ఏ ఒక్కదానికీ గిట్టుబాటు ధరలు అనేవి లేకుండా పోయిందన్నారు. రైతుల శిస్తుల రద్దు, మధ్యంతర రుణాల చిన్న, సన్నకారు రైతులకు రుణమాఫీలు ఈ రోజుకీ ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వ కొట్టుమిట్టాడుతోందని ధ్వజమెత్తారు. సమావేశంలో రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ వడ్డి నాగేశ్వరరావు, మీసాల బాబూరావు, చక్రవర్తి రెడ్డి, మెహతాబ్ ఖురేషీ, ఆబోతుల వెంకట్‌నాయుడు, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయింపు



ఇచ్ఛాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన గల ఖాళీ స్థలాన్ని ఆటో స్టాండ్‌కు కేటాయించారు. ఈ మేరకు స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీష్‌కుమార్ స్టాండ్ తాత్కాలిక నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఏపీ ఎస్ఎల్ఎస్, డీఎల్ఎస్ఏ శ్రీకాకుళం ఆదేశాల మేరకు శనివారం స్థలం కేటాయించారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, కమిషనర్ ఎన్.రమేష్, టీపీఓ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జి.సిగడాం, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలతో పాటు ప్రజా అవసరాల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పలు గ్రామాల నుంచి పలుశాఖలకు సంబంధించి 134 వినతులు వచ్చాయి. అనంతరం ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, మీసాల రవికుమార్, వజ్జపర్తి రఘురాం, టంకాల మౌళీశ్వరావు పాల్గొన్నారు.

సైన్సు పోస్టులు ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలల వరకు ప్రభుత్వం జీవో 21 ప్రకారం ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపునకు ఒక సీక్వెన్సీ ఇచ్చిందని, ఆ మేరకు 4వ పోస్టుగా బయాలాజికల్ సైన్స్ పోస్టు ఇవ్వాలని బయాలజీ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు ఉదయకుమార్, గోవిందరావు కోరారు. ఈ మేరకు శనివారం డీఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా బయలాజికల్ పోస్టులు ప్రాథమికోన్నత పాఠశాలలో తొలగించడం వల్ల ఎక్కువ మంది ఉపాధ్యాయులు కంపల్సరీ బదిలీలకు లోనై, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిపై ప్రభావం పడుతుందన్నారు. అందువల్ల న్యాయం చేయాలని కోరారు.

వినతులపై దృష్టి సారించాలి

జి.సిగడాం, మే 17(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ ఎం.సరిత అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో టీడీలు నిర్మల, గాయత్రి, ఆర్ఐ రాధ, జూనియర్, సీనియర్ అసిస్టెంట్స్, వీఆర్వో భూపతి నర్సింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని తరిమికొడదాం

రణస్థలం, మే 17(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తరిమికొట్టేందుకు ప్రధాని మోదీ కృతనిశ్చయంతో ఉన్నారని నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బంటుపల్లి గ్రామంలో సర్పంచ్ నడుకుదిటి రజి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తిరంగ యాత్రలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముప్పిడి సురేష్, పిన్నింటి భానోజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

21న మినీ మహానాడు

ఆమదాలవలస, మే 17(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో ఈ నెల 21న మినీ మహానాడు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొర్లకోట రోడ్డులో ఉన్న ఓ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీ ముఖ్యనాయకులు, మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

నీటి సమస్య రానివ్వొద్దు

ఇచ్ఛాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. వేసవిలో ప్రజలకు నీటి సమస్య రానివ్వకుండా పూర్తిస్థాయిలో తాగునీరు అందివ్వాలని సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ ఈపీహెచ్) పి.కామేశ్వరరావు, సుగణకార రావు (సుడా) అధికారులకు సూచించారు. శనివారం సంతపేట వద్ద ఉన్న పంప్ హౌస్ పరిశీలించారు. డీఈ సుధాకర్, ఏఈ జగన్నాథం, కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు

పీఎన్ కాలనీలో చోరీ

శ్రీకాకుళం క్రైం, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎన్ కాలనీలో గల ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పీఎన్ కాలనీ 0-లైన్ సమీపంలో గల ఓ బ్యూటీ పార్లర్ మేడపైన నివాసం ఉంటున్న దుర్గా ఇంట్లో గుర్తుతెలియనివారు చొరబడి బీరువాలో ఉన్న రెండు బంగారు చెవి దిద్దుల, ఒక జత వెండి పట్టీలు, కొంత నగదు అపహరించుకుపోయారు. ఈ మేరకు టూ టౌన్ ఎస్ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

పొందూరు, మే 17(ఆంధ్రజ్యోతి): బాణాం గ్రామానికి చెందిన సూర సూరిబాబు ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద శనివారం తండ్యాం పంచాయతీ మూడు మర్రిచెట్లు వద్ద విచారణ జరిపారు. తనను కులంపేరుతో దూషించి దాడిచేసినట్టు బాణాం గ్రామానికి చెందిన పి.రవిబాబు, మూడుమర్రిచెట్లు వద్ద త్రినాథస్వామి ఆలయ నిర్వాహకులు జ్యోతిస్వామిపై పొందూరు పోలీస్‌స్టేషన్‌లో సూరిబాబు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

కళింగ సంఘం నూతన కార్యవర్గం



సోంపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సోంపేట పట్టణ కాళింగ సంఘం నూతన కార్యవర్గాన్ని వెద్యుడు ఎస్.రాజేంద్రప్రసాద్, పండి క్రిష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తమ్మినేని శేషయ్య, ఉపాధ్యక్షుడిగా పొందూరు శ్రీధర్, కార్యదర్శిగా వజ్జ క్రిష్ణారావు, కోశాధికారిగా దుప్పల చలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూ వాయిదా

సరుబుజ్జిలి, మే 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న జరగాల్సిన ఎస్‌సి కార్పొరేషన్ సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ఎంపిడివో ఎం.పావని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు మేరకు తదుపరి తేదీ మరలా ప్రకటించడం జరుగుతుందని, ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గ్రహించాలన్నారు.

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ

శ్రీకాకుళం కల్చరల్ మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని నానుబాల వారి వీధిలో ఉన్న విజయ దుర్గ అమ్మవారికి అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో అమ్మవారు

మరమ్మతులు లేక..తాగు నీరందక


పెద్దలోగిడిలో బోరు వినియోగించకుండా విడిచిపెట్టిన దృశ్యం

● ఇదీ గ్రామీణప్రాంతాల్లో హ్యాండ్‌బోర్ల దుస్థితి

పలు గ్రామాల్లో హ్యాండ్‌బోర్ల నిర్వహణ నీరుగారుతోంది. కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో తాగునీరందడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈనేపథ్యంలో దాహం తీర్చుకోవడానికి పొలాల్లో బావులు ఆశ్రయించడంతోపాటు క్యాన్లతో నీటిని కొనుగోలు చేసుకోవల్సివస్తోందని పలువురు వాపోతున్నారు. అట్టహాసంగా జేజేఎం పథకం నిధులతో ఏర్పాటుచేసిన పథకాలు అటకెక్కుతున్నాయి.

పాతపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 34 పంచాయతీల్లో 309 బోర్లు ఉన్నాయి. వీటి మరమ్మతులకు ఈ ఏడాది రూ.ఐదులక్షలతో స్పేర్‌పార్ట్‌లు తప్పించారు.సకానికిపైగా బోర్లు మూలకుచేరాయి. ఈనేపథ్యంలో అందుబాటులో ఉన్న ఇద్దరు బోరుమెకానిక్‌లు చాలకపోవడంతో సకాలంలో మరమ్మతులకు నోచుకోవడంలేదు. పెద్దలోగిడి ఎస్సీవీధి సమీపంలోగల హ్యాండ్‌బోరు నిర్వహణలేక మూలకుచేరింది. పంచాయతీ సిబ్బంది వేసవిలో తాగునీటి ఎద్దడి నియంత్రణలో భాగంగా మరమ్మతులు చేస్తామని ఉన్న భాగాలన్నీ విప్పేశారు. నెలలుగడుస్తున్నా నేటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో సచివాలయంలో సిబ్బందిని పలువురు ప్రశ్నించారు. ఈనేపథ్యంలో ఎస్సీవీధివాసులు తాగునీటికిపొలాల్లో బావులను ఆశ్రయిస్తున్నారు. అలాగే అనంతగిరి, తామర ఎస్సీవీధి తదితర గ్రామాల్లో బోర్లు పాడై మూలకుచేరాయి. పలుసార్లు పంచాయతీ అధికారులకు తెలియజేస్తున్నా మరమ్మతులకు నోచుకోవడంలేదని మహిళలు వాపోతున్నారు.వేసవిలో తాగునీటిఎద్దడి నివారణకు ముందస్తుచర్యల్లో భాగంగా బోర్ల మరమ్మతులకు కావాల్సిన సామగ్రిని ఎంపీడీవో కార్యాలయంలో సిద్ధంచేశామని అధికారులు, ప్రజాప్రతినిధులు చేసిన ప్రకటనలు నీరుగారిపోయాయి.

అటకెక్కుతున్న జేజేఎం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీర్చాలని జేజేఎం నిధులతో ఏర్పాటుచేసిన పథకాలు అటకెక్కుతున్నాయి. నిర్వహణ లోపం వల్ల కొళాయిల ద్వారా నీరందని పరిస్థితి నెలకొంది. పాతపట్నంలోని బాలాజీనగర్-1 2, నీలకుంఠాపురం, చర్చివీధి ఎగువభాగంలో వాటర్ ట్యాంకుల్లోకి నీరు అందకపోవడంతో కొళాయిల ద్వారా నీరు సరఫరా కావడంలేదు. పెదలోగడిలో కొళాయిలు బోరు ఫెయిల్ కావడంతో జేజేఎం కొళాయిలు నిరుపయోగం మారాయి.ఈ నేపథ్యంలో జలజీవన్ పథకం కింద ఏర్పాటుచేసిన కొళాయిలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి.

పర్యవేక్షణ లేక.. వినియోగానికి నోచుకోక


ఎం.గడివూరులో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రం

● రోడ్డు పక్కనే చెత్త వేస్తున్న వైనం
● ఇదీ వజ్రపుకొత్తూరు మండలంలో చెత్త సంపద కేంద్రాల దుస్థితి

వజ్రపుకొత్తూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ లేక వినియోగానికి నోచుకోవడంలేదు. ఇప్పటి వరకూ ఐదుగ్రామాల్లో చెత్తసంపద కేంద్రాల పనులు పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. 37 పంచాయతీలకు కొన్నినిర్మించగా మరికొన్ని అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో వీటి నిర్మాణాలు చేపట్టినా అధికారులు చొరవ తీసుకోకపోవడంతో వినియోగంలోకి రావడంలేదు. వీటిపై పూర్తిస్థాయిలో అధికారులు అవగాహనకల్పించకపోవడంతో నిరుపయోగంగా మారాయని ఆయాగ్రామాల ప్రజలు చెబుతున్నారు.దీంతోప్రభుత్వం వీటి నిర్మాణానికి వెచ్చించిన నిధులు వృథాగా మారుతున్నాయి. కొన్నిగ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలకు సమీపంలో రోడ్డు పక్కనే చెత్త వేస్తుండడం విశేషం. వాస్తవానికి ఇళ్ల నుంచి తడి, పొడిచెత్త వేర్వేరుగా ఇళ్ల నుంచి సేకరించడానికి ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్ బకెట్లను ప్రభుత్వం గతంలో ఉచితంగా పంపిణీచేయాలని నిర్ణయించింది.అయితే కొన్నిగ్రామాల్లో వీటికి ఇంటింటికి పంపిణీ చేయగా మరికొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలో ఉంచారు. వేరుచేసిన చెత్తను కేంద్రాలకు తరలించి ఎరువులుగా మార్చి రైతులకు విక్రయించి, పంచాయతీలకు అధనపుసంపద లభించే అవకాశమున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పంట పొలాల్లో వ్యర్థాల దహనం


బృందావనంలోని ఓ పొలంలో వ్యర్థాలు దహనం చేసిన దృశ్యం

● శ్వాసకోస వ్యాధులు ప్రబలే అవకాశముందని భయాందోళన చెందుతున్న ప్రజలు

సంతబొమ్మాళి, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బృందావనం, కాశీపురం పంటపొలాల్లో వ్యర్థాలను రైతులు దహనంచేస్తుండడంతో చుట్టుపక్కల నివాసముండే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. రబీలో వరి పంట వేసిన రైతులు ఖరీఫ్‌కు సమాయతంకావడంలో భాగంగా పొలాల్లో వ్యర్థాలు, గడ్డికాల్చుతున్నారు. దీంతో మంటల వల్ల వస్తున్న పొగపీల్చడం ద్వారా శ్వాసకోస వ్యాధులు ప్రబలే అవకాశముందని పలువురు ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలు కాల్చడం వల్ల పర్యావరణంపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు. దీనికితోడు నత్రజని, పోటాషియం, భాస్వరం వంటి పోషకాలు క్షీణించి నేల సారవంతం తగ్గుతుందని,ఈ విషయంపై రైతులకు వ్యవసాయాధికారులు అవగహన కల్పించాలని డీజీపురం పాఠశాల ఉపాధ్యాయుడు టి. భాస్కరరావు కోరారు.

నేడు మినీ మహానాడు

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం మినీమహానాడు నిర్వహించనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒకప్రకటనలో తెలిపారు. నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, విజయవంతం చేయాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినం పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జూనియర్ ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ ప్రతినిధి బృందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారంతా రక్తదానం చేయాలని కోరారు.

నేడు రైల్వేట్రాక్‌లో నిర్వహణ పనులు

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి- తెంబూరు రోడ్డు జంక్షన్ పరిధిలో పాత జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి సోమవారం ఉదయం ఆరు గంటల వరకు నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఈకో రైల్వే అధికారి లక్ష్మీకాంత్‌పానీ ఒక ప్రకటనలో తెలిపారు. వాహనచోదకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేటి నుంచి అంబికాదేవి ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినడోకులపాడులో ఆదివారం నుంచి మూడురోజులపాటు అంబికాదేవి గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ ఒకప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా పగటివేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

వంతెన నిర్మాణానికి భూమిపూజ

నందిగాం, మే 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి రాంపురం వయా గొల్లూరు రహదారిలో వంశధార ప్రధాన ఎడమకాలువపై వంతెన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయంలో ఇక్కడ వంతెన సనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో వంతెన 2023 ఏప్రిల్ 24న కూలిపోవడంతో పనులు చేపట్టకుండా వదిలేసి కాలిబాట వంతెన నిర్మించారు. దీంతో ట్రాక్టర్లు, ఆటోలు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఈనేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, జీరు నానీరెడ్డిలు వంతెన నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

పోలాకి, మే 17(ఆంధ్రజ్యోతి) :పోలాకి తహసీల్దార్‌గా పొన్నాడ శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత తహసీల్దార్ మంగిపూడి సురేష్‌కుమార్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.దీంతో జలుమూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేసిన శ్రీనివాసరావును ఇక్కడ తహసీల్దార్‌గా నియమించారు.శనివారం సురేష్‌కుమార్, శ్రీనివాసరావులకు రికార్డులను కేటగిరి ప్రకారం అప్పగించారు. బదిలీపై వెళ్తున్న సురేష్‌కుమార్‌కు సిబ్బంది శనివారం వీడ్కోలు పలికారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

నరసన్నపేట, మే 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథస్వామి తెలిపారు. శనివారం మండలంలోని మాకివలసలో యంత్రీకరణ పనిముట్లు అందజేసిన రైతులతో మాట్లాడారు. వ్యవసాయ యంత్రీకరణలోభాగంగా రాయితీపై అందజేసిన పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సునీత పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: మంత్రి


అర్జీదారులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ఆకాంక్షించే ప్రతి ఒక్కరి కలలను రాష్ట్ర ప్రభుత్వం నిజం చేస్తోందని తెలిపారు. పలు సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలు ఒక్కొక్కటిగా చేస్తున్నామని తెలిపారు.

5.34 లక్షల ఇళ్లకు కుళాయిలు

● 800 పనులకు టెండర్లు: ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ షాన్ బాషా

నరసన్నపేట, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలజీవన్‌మిషన్‌లో 5.34 లక్షల ఇళ్లకు ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీరందిస్తామని గ్రామీణ నీటిసరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఎస్ఈ షాన్ భాష తెలిపారు.శనివారం నరసన్నపేట ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 1793 పనులను సకాలంలో ప్రారంభించకపోవడంతో రద్దు చేసి రీ టెండర్లను పిలిచామని, వీటిలో 800 పనులకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు.మొదటివిడతలో 2.12 లక్షలు ఇళ్లకు ఇంటింటా కొళాయిలు వేశామని చెప్పారు.వంశధార బ్యారేజీ నుంచి తాగునీరును జిల్లా అంతటా తరలించేందుకు రూ.3300 కోట్లతో పనులు ప్రతిపాదన చేశామన్నారు. నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం,ఆమదాలవలస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులకు అనుసంధానంచేసి వేసవిలో తాగునీరందిస్తామని తెలిపారు. ఇప్పటికే పలాస,ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోగలగ్రామాలకు తాగునీరందిస్తున్నామని చెప్పారు.నరసన్నపేటలో జేజేఎం రెండోవిడతలో 9.06 కోట్లతో ఇంటింటా కొళాయిలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ రంగప్రసాద్, డీఈఈ సుదర్శనరావు పాల్గొన్నారు.

గొలియాపుట్టిలో మహారుద్రాభిషేకాలు


గొలియాపుట్టిలో మహారుద్రాభిషేకాల్లో పాల్గొన్న మహిళలు

జలుమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): గొలియాపుట్టి ఉమా రామలింగేశ్వరస్వామికి శనివారం సామూహిక మహారుద్రాభిషేకాలు నిర్వహించారు. పుష్కర వార్షికోత్సవం పురస్కరించుకొని పురోహితులు అక్కాజోస్యుల రమేష్‌శర్మ ఆధ్వర్యంలో తొమ్మిది మంది రుత్విక్కులు పూజలు చేశారు. ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కంపోస్టు పిట్స్‌పై అవగాహన అవసరం

మందస, మే17 (ఆంధ్రజ్యోతి):మహిళలకు కిచెన్‌గార్డెన్,కంపోస్టు పిట్స్‌పై అవగాహన అవసరమని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మందసలో గ్రామసంఘం ఆధ్వర్యంలో మహిళాసంఘ సభ్యులకు కిచెన్ గార్డెన్,కంపోస్టు నిర్మించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువతి మృతి

పలాసరూరల్, మే17(ఆంధ్రజ్యోతి):మండలంలోని లొత్తూరు పంచాయతీ కొత్తపేటకు చెందిన సవర బసంతి(22) శనివారం చికిత్సపొందుతూ మృతిచెందింది.బసంతి తల్లి సవర మహాలక్ష్మి, కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు.. సవర మహాలక్ష్మికి ముగ్గురు సంతానం. భర్త రాజేష్ పదేళ్ల కిందట మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మహాలక్ష్మి జీడిపప్పు కార్మికురాలిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శుక్రవారం ఉదయం పెద్ద కుమార్తె బసంతి పనికి వెళ్లలేదు. ఖాళీగా కూర్చొన్నావా అని మహాలక్ష్మి మందలించింది. బసంతి మనస్తాపానికి గురై గడ్డిమందును తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. దీంతో హుటాహుటిన గ్రామస్థుల సహాయంతో పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స అనంతరం వైద్యులు శ్రీకాకుళం తరలించారని సూచించారు.ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందింది. హెచ్‌సీ బి.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీజేలకు అనుమతి తప్పనిసరి: సీఐ

పాతపట్నం, మే17(ఆంధ్రజ్యోతి): డీజేలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పాత పట్నం సీఐ వి.రామారావు తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ వివాహ వేడుకలు, ఆధ్యాత్మిక, వినోదకార్యక్రమాల్లో అనుమతి లేకుండా డీజేలు వినియోగించడం నేరమని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శబ్ద, వాయు కాలుష్యాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

నిరుపయోగంగా నీటి తొట్టె


వృథాగా నీటి తొట్టె

హరిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని కొండలోగాంలో వేసవిలో పశువుల దాహార్తిని తీర్చే పశువుల తొట్టె నిరుపయోగంగా మారింది. సుమారు రూ. 40 వేలతో నిర్మించిన తొట్టె నీటి సదుపాయం లేక వృథాగా మారింది. దీంతో అటు పశువులకు ఉపయోగంలో లేక నిధులు వృథాఅయ్యాయి. అధికారులు స్పందించి జల్‌జీవన్ పథకంలో పైప్‌లైన్ వేసి నీటి తొట్టె వినియోగంలోకి వచ్చేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పశువుల రవాణా కేసులో ఇద్దరి అరెస్టు

పలాసరూరల్, మే17(ఆంధ్రజ్యోతి):లక్ష్మీపురంటోల్‌గేటు వద్ద శనివారం పశువుల రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టుచేసినట్లు హెచ్‌సీ వై.రవికుమార్ తెలిపారు. వాహనాలు పోలీసులు తనిఖీచేస్తున్న సమయంలో ఓట్రక్కును పరిశీలించారు. అందులో ఆరు దున్నపోతులను కొల్లి జనార్దనరావు, రౌతు సీతారాములు తరలిస్తుండగా పట్టుకొని విచారించగా పశువులను వధ నిమిత్తం తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

12 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

పలాస, మే17(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో శనివారం ద్విచక్రవాహనాలు తనిఖీచేసి 12మందిని డ్రంకన్ డ్రైవ్ కేసులో అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. వీరికి పలాస కోర్టులో హాజరుపరచగా కోర్టు రూ. 10వేలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు.

కాలువ కప్పేయడంతో అగచాట్లు

● నౌపడ- మెళియాపుట్టి కూడలిలో రోడ్డుపై చేరుతున్న నీరు


నౌపడ-మెళియాపుట్టి రోడ్డులో నిలిచిన నీరు

టెక్కలి, మే 17(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని నౌపడా- మెళియాపుట్టి నాలుగురోడ్ల కూడలి సమీపంలో ఇరువైపులా నిర్మాణాల చేపట్టి కాలువలు కప్పేయడంతో వర్షం నీరు నిల్వఉండడంతో పాదచారులు, వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు.గతంలో ఉన్న కాలువపై నిర్మాణాలు చేపట్టడంతోనే వర్షంనీరు ఎటూవెళ్లకుండా నిలిచిపోయిందని రాంపురం,నర్సింగపల్లి సర్పంచ్‌లు పినకాన జోగారావు,రౌతు జయమోహన్ ఆరోపించారు. తక్షణమే ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ సిబ్బంది కాలువ ఆక్రమణలు తొలగించి వర్షం నీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం

ఎచ్చెర్ల, మే 17(ఆంధ్రజ్యోతి): కుశాలపురం సింహద్వారం వద్ద రోడ్డుపక్కన అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వృద్ధుడు పడి ఉండటాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎచ్చెర్ల పోలీసులు స్పందించి శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో వృద్ధుడ్ని చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఆయన మృతిచెందాడు. మృతుని వివరాలు తెలియకపోవడంతో ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. ఈ వృద్ధుడి వివరాల తెలిసినవారు 63099 90816ఫోన్‌నెంబరులో సంప్రదించాలని ఎస్ఐ వి.సందీప్ కుమార్ కోరారు.

బీఎస్ఎఫ్ జవాన్..


మోహన్‌రావు (ఫైల్)

ఆమదాలవలస, మే17(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఆరోవార్డులోగల టి.మన్నయ్యపేటకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ గొద్దు మోహన్‌రావు(46) మృతి చెందారు. న్యూఢిల్లీలోని బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తుండగా శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురయ్యారు. వెంటనే తోటి సైనికులు మోహన్‌రావును సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం ఉదయం మృతదేహం ఢిల్లీ నుంచి విశాఖకు అక్కడ నుంచి స్వగ్రామానికి తీసుకురానున్నారు. ఈమేరకు కోరాపుట్‌లోని బీఎస్ఎఫ్ బెటాలియన్ సైనికులు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మోహనరావుకు భార్య సంధ్య, కుమార్తె జాస్మిని, కుమారుడు శశాంక్, తండ్రి అప్పలరాము ఉన్నారు. మోహన్‌రావు మృతితో టి.మన్నయ్యపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.

300 సారా ప్యాకెట్లు స్వాధీనం

సోంపేట, మే 17(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలోని జెన్నాఘయి వద్ద గ్రామానికి చెందిన బుడ్డేపు దుర్యోధన 300 సారా ప్యాకెట్లు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా స్వాధీనంచేసుకున్నట్లు సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. దుర్యోధనను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, కోర్టు 14రోజుల రిమాండ్ విధించినట్టు చెప్పారు.ఈ దాడుల్లో శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సుజాత, సిబ్బంది విజయ్, గాలిబ్, రమణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కల్తీ ఆహారం తిని పర్యాటకులకు అస్వస్థత


టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్సపొందుతున్న టూరిస్టులు

టెక్కలి,మే 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక బోర్డర్ ప్రాంతం నుంచి అయోధ్య వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారంరాత్రి ఒడిశాబోర్డర్‌లో కల్తీ ఆహారం తిని బస్సులో ఉన్న 16మంది పర్యాటకులు అస్వస్థతకు గురయ్యారు. అయితే శుక్రవారం రాత్రికే కొందరు బరంపురం ఆసుపత్రిలో చికిత్సపొంది టూరిస్ట్ బస్సును విడిచిపెట్టి రైలులో ఇళ్లకు చేరారు. మరికొందరు పర్యాటకులు బస్సులో వస్తుండగా శనివారం తెల్లవారి ఆరుగంటలకు టెక్కలి వచ్చేసరికి వాంతులు, విరోచనాలతో వారంతా జిల్లాకేంద్రాసుపత్రిలో చేరారు. ఫుడ్‌పాయిజన్ జరిగిందని గ్రహించిన వైద్య బృందం వారికి అవసరమైన సేవలందించడంతో కోలుకున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: తహసీల్దార్

జలుమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): క్వారీ యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జన్ని రామారావు హెచ్చరించారు. శనివారం జలుమూరులోని ఆదిలక్ష్మి స్టోన్‌క్రషర్, జమ్మినివలస సాంప్రా ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ క్వారీని ఆర్ఐ పి.కిరణ్, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, రెవెన్యూసిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వారీలీజు అనుమతులు పరిశీలించినట్లు తెలిపారు. క్వారీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు చెప్పారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకూ ఎటువంటి ఆపరేషన్లు చేయకూడదని క్వారీ యజమానులకు ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధించాలి: జేసీ

నరసన్నపేట, మే 17(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, రోడ్డుపై చెత్త వేసిన వ్యాపారులపై జరిమాన విధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. శనివారం నరసన్నపేట పంచాయతీకార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకం వేతనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన నరసన్నపేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై అసహనం వ్యక్తంచేశారు. కాగా లెప్రసీకాలనీ చెందిన పలువురు తాగునీరు రావడంలేదని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం మడపాంలో ఓ రైస్ మిల్లును తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో మధుసూదనరావు, సర్పంచ్ శంకరరావు, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ఈవో ద్రాక్షాయిణి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

పలాస, మే 17(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ మొక్కలునాటి పర్యావరణ పరిక్షణకు తోడ్పాటు అందించాలని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు కోరారు. స్థానిక కిడ్నీ పరిశోధన కేంద్రం,200 పడకల ఆసుపత్రి వద్ద స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటుచేయాలి

పాతపట్నం, మే 17(ఆంధ్రజ్యోతి):ఉపాధి వేతనదారులకోసం పని ప్రదేశంలో టెంట్లుఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరావు తెలిపారు.మండలంలోని కొరసవాడలో ఉపాధి వేతనదారులతో స్వచ్ఛాంధ్ర,స్వర్ణాంధ్ర కార్యక్రమంలోభాగంగా పారిశధ్యంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, డీటీ ప్రసాదరావు, సర్పంచ్ ఉమాదేవి, కార్యదర్శి కృష్ణంరాజు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జలుమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు కోరారు. శీముఖలింగంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జలుమూరులో తహసీల్దార్, మండలపరిషత్ కార్యాలయాల చుట్టు పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ జె.రామారావు, ఆర్ఐ కిరణ్, మండలసర్వేయర్ తర్ర నాగేశ్వరరావు,ఈవోపీఆర్డీ ఉమా మహేశ్వరరావు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేట: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై ఉపాధి వేతనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నిర్వహణ లేక.. రాకపోకలు సాగించలేక


కొమ్మువలస రోడ్డులో చెరువును తలపిస్తున్న గోతులు

● ఏటా వర్షాకాలంలో వాహనచోదకులు, ప్రయాణికులకు తప్పని అవస్థలు ● ఇదీ కొమ్మువలస రోడ్డులో దుస్థితి

ఎల్.ఎన్.పేట, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మువలస రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో ప్రయాణికులు,వాహనచోదకుల రాకపోకలకు అవస్థలుపడుతున్నారు. ఈమార్గంలో చిన్నకొల్లివలసఆర్‌అండ్‌ఆర్‌కాలనీ, బొరమాంబపురం,కొమ్మువలస, గొట్టిపల్లి, కొండశివారులోని పలుగ్రామాలకు చెందిన గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు.ప్రధానంగా అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు అనుసరించి మోదుగవలస జంక్షన్ నుంచికొమ్మువలస మీదుగా గొట్టిపల్లి వరకు ఉన్నరోడ్డు పూర్తిగా గోతులమయంకావడంతో చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరుతుండడంతో నడిచివెళ్లేందుకు సైతం ఇబ్బందులుతప్పడంలేదని పలువురు వాపోతున్నారు.గతఏడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు హామీఇచ్చినా అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కనీస మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదని కొమ్మువలస, గొట్టిపల్లి గ్రామస్థులు వాపోతున్నారు. అత్యవసర సమయంలో వాహన చోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.